ప్రజాశక్తి
సోమవారం 6 నవంబరు 2023
5
శ్రీకాకుళం



సెలవు రోజున 'నారాయణ' తరగతులు

అడ్డుకున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని 80 అడుగుల రోడ్డులో గల నారాయణ జూనియర్ కళాశాలలో ఆదివారం రోజు విద్యార్థులకు తరగతులు నిర్వహించింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఎం.సంతోష్, కె.కార్తీక్ కళాశాలకు వెళ్లి యాజమాన్య ప్రతినిధులతో మాట్లాడారు. సెలవు రోజుల్లో తరగతులను నిర్వహించడం ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించేడమేనన్నారు. సెలవు రోజున తరగతుల నిర్వహణ వల్ల విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని వివరించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఇంటర్ బోర్డు అధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను ఇళ్లకు పంపించారు.

కదులుతున్న అక్రమాల డొంక

- బూర్జ పిఎసిఎస్‌లో రైతుల సొమ్ము మాయంపై విచారణ
- రైతులను పిలిచి మాట్లాడుతున్న అధికారులు
- రంగంలోకి దిగిన సొసైటీ పెద్ద మనిషి
- సొమ్ములు తీసుకున్నట్లుగా సంతకాలు చేయించేందుకు యత్నం

బూర్జ పిఎసిఎస్‌లో వెలుగు చూసిన అక్రమాల డొంక కదులుతోంది. ప్రాథమిక సహకార పరపతి సంఘంలో అధిక మొత్తంలో సొమ్ము మాయం కావడంపై సహకారశాఖ అధికారులు విచారణ చేపట్టారు. రైతులను పిలిపించి మాట్లాడారు. రైతులు తీసుకున్న అప్పు, వాయిదా సొమ్ము వివరాలను అడిగి తెలుసుకున్నారు. దీంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు సొసైటీ పెద్ద మనిషి రంగంలోకి దిగారు. పిఎసిఎస్‌కు సొమ్ములు బకాయి పడినట్లు రైతులతో బలవంతంగా సంతకాలు చేయించుకునేందుకు తెర తీశారు. దీనిపై రైతుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, బూర్జ

బూర్జ పిఎసిఎస్ పరిధిలో గతంలో ఎన్నడూ లేని విధంగా అవకతవకలు చోటుచేసుకున్నాయి. రైతులకు చెందిన లక్షలాది రూపాయలను అక్రమార్కులు స్వాహా చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. వీటిపై ప్రజాశక్తి జిల్లా సంచికలో గత నెల 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీనిపై అధికార యంత్రాంగం మరోసారి విచారణ మొదలుపెట్టింది. రికార్డులు, ఫైళ్ల పరిశీలన చేపట్టింది. దీంతో ఉలిక్కిపడిన అక్రమార్కులు కొత్త పన్నాగానికి తెర తీశారు. రైతులను సొసైటీకి పిలిపించి వారు సొమ్ములు బకాయి పడినట్లు సంతకాలు చేయిస్తున్నారు. ఇప్పటికే వాయిదా సొమ్ము చెల్లించిన రైతులు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. తాము ఎన్నిసార్లు డబ్బులు చెల్లించాలంటూ సొసైటీ అధికారులతో వాగ్వాదానికి దిగుతున్నారు. డబ్బులు చెల్లించబోమంటూ కరాఖండిగా చెప్తున్నారు.

రంగంలోకి దిగిన సొసైటీ పెద్ద మనిషి

బూర్జ పిఎసిఎస్‌లో చోటుచేసుకున్న అక్రమాలపై అధికార యంత్రాంగం కదిలింది. శ్రీకాకుళం సబ్ డివిజనల్ అధికారి చంటిబాబు, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.భూషణరావు విచారణ చేపడుతున్నారు. రైతులను కార్యాలయానికి పిలిచి, వారు చెప్పిన వివరాలను నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలో అక్రమాలకు సూత్రధారిగా ఉన్న సొసైటీ పెద్ద మనిషి రంగంలోకి దిగినట్లు తెలిసింది. రైతులు తాము అప్పుగా తీసుకున్న సొమ్ము, పలు సందర్భాల్లో చెల్లించిన వాయిదా సొమ్ముల వివరాలను అధికారులకు వివరించారు.

తాము సొసైటీకి చెల్లించాల్సిందేమీ లేదని, తమ పేరును అప్పు ఉన్నట్లు చూపిస్తున్నారని రైతులు అధికారుల ముందు వాపోయారు. దీంతో కంగుతిన్న సొసైటీ పెద్ద మనిషి మీరు సగం చెల్లించండి, సొసైటీ మిగతా సొమ్ము కట్టేస్తుందంటూ సలహా ఇచ్చినట్లు తెలిసింది. డబ్బులు పూర్తిగా చెల్లించినా, ఆ సగం సొమ్ము తామెందుకు చెల్లించాలంటూ రైతులు నిలదీస్తున్నారు. తాము డబ్బులు చెల్లించబోమని చెప్పి కార్యాలయం నుంచి వచ్చేస్తున్నట్లు తెలుస్తోంది.

డబ్బులు కట్టేందుకు అంగీకరిస్తున్న సిబ్బంది

తాము తీసుకున్న రుణానికి వడ్డీ చెల్లించినా నోటీసులు పంపారంటూ అల్లెన గ్రామానికి చెందిన రైతు బాల చంద్రమౌళీశ్వరరావు విచారణ అధికారులకు చెప్పారు. దీనిపై అక్కడ ఉన్న సిబ్బంది రూ.40 వేలు తాము కట్టేందుకు అంగీకరించినట్లు తెలిసింది. అదే గ్రామానికి చెందిన జడ్డు అప్పమ్మ రుణం తీసుకోకపోయినా, వారి కుమారులను పిలిచి డబ్బులు కట్టాలని పిఎసిఎస్ సిబ్బంది అడిగినట్లు తెలిసింది. అప్పు ఎవరు తీసుకున్నారని, తామెందుకు చెల్లించాలంటూ ఎదురుతిరగడంతో సొసైటీ పెద్ద మనిషి, సిబ్బంది తాము రూ.ఏడు వేలు చెల్లిస్తామని, మిగిలిన సొమ్ము మీరు చెల్లించాలంటూ సలహా ఇచ్చినట్లు తెలిసింది. అప్పు సొమ్ముతో తమకు సంబంధం లేదంటూ వారు వెనుదిరిగి వెళ్లిపోయినట్లు తెలిసింది.



బూర్జ పిఎసిఎస్‌లో ఫైళ్లను పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్ ఫొటో)

నిలదీస్తే నీళ్లు నములుతున్న సిబ్బంది

బూర్జ మండల కేంద్రంలోని శ్రీమన్నారాయణ గ్రూపునకు చెందిన పది మంది రైతులు పంట ఖర్చుల కోసం 2020లో రూ.రెండు లక్షల అప్పు తీసుకున్నారు. అందులో సిహెచ్.కృష్ణమోహన్ అనే రైతు రూ.1500 చొప్పున ఏడు వాయిదాలు చెల్లించారు. డబ్బులు చెల్లించలేదని రెండుసార్లు నోటీసులు ఇవ్వడంతో, సొసైటీకి మరో రూ.20 వేలు ఇచ్చారు. ఇప్పుడు సొసైటీకి డబ్బులు చెల్లించాలని పిలిపించి మీరు రూ.69 వేలు బకాయి పడినట్లుగా రికార్డులు చూపించారు. దీనిపై కృష్ణమోహన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎప్పుడెప్పుడు ఎవరెవరికి ఎంత సొమ్ము చెల్లించారో చెప్పడంతో, సిబ్బంది నీళ్లు నమిలారు. పిఎసిఎస్ వాళ్లు న్యాయం చేస్తారంటూ సొసైటీ పెద్ద సలహా ఇవ్వడంతో ఆయన వెనుదిరిగారు.

అక్రమాలు రుజువైతే చర్యలు

సొసైటీలో రైతులు తీసుకున్న రుణాలు, వారు చెల్లించిన వాయిదాల సొమ్ము వివరాల రికార్డులను పరిశీలిస్తున్నాం. రైతుల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్నాం. పరిశీలన పూర్తయ్యాక ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తాం. అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే అధికారులు చర్యలు తీసుకుంటారు.

- చంటిబాబు, సహకార శాఖ సబ్ డివిజనల్ అధికారి



మాట్లాడుతున్న ధర్మాన ప్రసాదరావు

జీవన ప్రమాణాలే అభివృద్ధి సూచీలు

- రాష్ట్రంలో అవినీతిరహిత పాలన
- 23న సిఎం చేతుల మీదుగా కిడ్నీ ఆస్పత్రి ప్రారంభం
- సామాజిక సాధికార బస్సు యాత్రలో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - పలాస

మారుతున్న జీవన ప్రమాణాలే అభివృద్ధి సూచీలు అని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. వైసిపి సామాజిక సాధికార బస్సు యాత్ర కాశీబుగ్గలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. ఒక కార్యక్రమాన్ని మొదలుపెడితే మూడు ప్రభుత్వాలు మారితే గానీ పూర్తి కాని పరిస్థితి ఉండేదన్నారు. కిడ్నీ రోగుల సమస్యలు తీర్చడానికి, వంశధార ప్రాజెక్టు నుంచి తాగునీరు అందించడానికి వైసిపి ప్రభుత్వ కాలంలోనే అనుకుని పూర్తి కూడా చేశామన్నారు. అభివృద్ధి అంటే కేవలం రోడ్లు, భవనాలే కాదని ప్రజల జీవన ప్రమాణాలు ఏమేరకు పెంచాలనే ఆలోచన అని అన్నారు. అందుకోసం తీసుకొచ్చిన మార్పులు ఓట్ల కోసం కాదన్నారు. పిల్లలకు చదువు చెప్పడం ఓట్ల కోసం కాదని, విద్య ద్వారా పేదరికం తొలగించే పని అని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అవినీతి రహిత పాలన అందిస్తున్నారని కొనియాడారు. రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాల పేరుతో రూ.2.30 లక్షల కోట్లు నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు అందించిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం ఇష్టానుసారంగా ప్రజలకు పథకాల డబ్బులు పంచేస్తోందని గుండెలు బాదుకున్న చంద్రబాబు నాయుడు, తాను అధికారంలోకి వస్తే అంతకంటే ఎక్కువ పథకాలను అందిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉద్దాన ప్రాంత కిడ్నీ రోగుల కోసం ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. పాదయాత్ర సమయంలో ఇక్కడి ప్రజల కష్టాలు తెలుసుకున్న జగన్ పలాసలో కిడ్నీ ఆస్పత్రి, పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు శంకుస్థాపన చేయడమే కాకుండా, ఈనెల 23న ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభం కానుందన్నారు. జిల్లాకు చెందిన ప్రతిపక్ష పాలకులు వారి హయాంలో ఉద్దాన ప్రాంతానికి తాగునీరు ఇచ్చారా...? ఆసుపత్రి కట్టించారా...? ఒక్క ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారా అని ప్రశ్నించారు. ప్రజలకు మంచి చేస్తున్న జగన్మోహన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు.

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో సంస్కరణలు తీసుకొచ్చారని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. ప్రభుత్వం ఆంగ్ల విద్యపై దృష్టిసారిస్తే చంద్రబాబు నాయుడు మాతృభాషను కించపరుస్తున్నారంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారని, టిడిపి నేతల పిల్లలు మాత్రం విదేశాల్లో ఆంగ్లంలో ఎలా చదివిస్తున్నారని ప్రశ్నించారు. తెలుగు భాషను నిర్లక్ష్యం చేయలేదన్నారు. ఆంగ్లం నేర్చుకుంటే ప్రపంచ దేశాల్లో ఉన్నతావకాశాలు లభిస్తాయని చెప్పారు.

జిల్లాలో వలసల నివారణకు రూ.4,500 కోట్ల వ్యయంతో చేపడుతున్న మూలపేట పోర్టు నిర్మాణం ద్వారా యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. వరి పంటకు సాగునీరు లేదని, సకాలంలో వర్షాలు కురకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి రైతుకు ఇన్సూరెన్స్ ద్వారా నష్టపరిహారం అందిస్తామన్నారు. రూ.700 కోట్ల వ్యయంతో ఉద్దాన ప్రాంతానికి ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. గౌతు, కింజరాపు కుటుంబాలు ఏళ్ల తరబడి జిల్లాలో రాజకీయాలు చేస్తున్నారని, జిల్లాకు ఏం అభివృద్ధి చేశారో చెప్పగలరా అని ప్రశ్నించారు. ముందుగా కాశీబుగ్గ బస్టాండ్ సమీపంలో ఉన్న వైఎస్, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో వైసిపి ఉత్తరాంధ్ర సమన్వయకర్త వై.వి సుబ్బారెడ్డి, వైసిపి రీజనల్ కోఆర్డినేటర్, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు గొర్లె కిరణ్ కుమార్, వి.కళావతి, కంబాల జోగులు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి, మాజీ ఎంపీ కిల్లి కృపారాణి, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్, పలు కార్పొరేషన్ల చైర్మన్లు పేరాడ తిలక్, మామిడి శ్రీకాంత్, దువ్వాడ వాణి తదితరులు పాల్గొన్నారు.



పాల్గొన్న వైసిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు

రోడ్డుపై సభావేదిక

ఇబ్బందులు పడిన ప్రజలు

పాత బస్టాండ్‌కు వెళ్లే కె.టి రోడ్డు పైనే సామాజిక సాధికార యాత్ర సభా వేదికను ఏర్పాటు చేయడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పలేదు. శనివారం రాత్రి నుంచే సభా వేదిక పనుల దృష్ట్యా శ్రీనివాస లాడ్జి నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్‌కు వెళ్లే మార్గంలో బారికేడ్లు ఏర్పాటు చేసి రాకపోకలు నిలిపివేశారు. కనీసం ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకూ అవకాశం లేకపోవడంతో పలాస నుంచి కాశీబుగ్గ వెళ్లేందుకు వీధుల మీదుగా తిరుగుతూ మూడు రోడ్ల జంక్షన్‌కు వెళ్లేందుకు తిప్పలు పడ్డారు. పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్‌కు బస్సులు రాకపోవడంతో శ్రీకాకుళం, విశాఖపట్నం వెళ్లేందుకు ప్రయాణికులు నానాపాట్లు పడాల్సి వచ్చింది. ఇచ్ఛాపురం నుంచి విశాఖ, శ్రీకాకుళం వెళ్లే బస్సులు, విశాఖ నుంచి ఇచ్ఛాపురం వెళ్లే బస్సులు కనీసం పాతబస్టాండ్ రావడానికి అవకాశం లేకుండా పాత జాతీయ రహదారి మూడు రోడ్ల జంక్షన్ వద్ద ఆపివేశారు. ఆటోలు కూడా తిరగకపోవడంతో నడుచుకుని కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలికి చేరుకుని అక్కడ బస్సులు ఎక్కారు. రోడ్లపై సభలు, సమావేశాలు నిర్వహించడమేమిటని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులపై ప్రభుత్వ నిర్లక్ష్యం

- క్రమబద్ధీకరణ చేయకుంటే వచ్చే నెలలో సమ్మె
- జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు



సమావేశంలో మాట్లాడుతున్న కాంతారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని సమగ్ర శిక్ష ఉద్యోగుల జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కాంతారావు విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేయడం లేదని, నెలల తరబడి వేతనాలు విడుదల చేయడం లేదన్నారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, మినిమం టైం స్కేల్ ఉద్యోగుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినిమం ఆఫ్ టైమ్ స్కేల్‌పై జిఒలు ఇచ్చిన ప్రభుత్వం దాన్ని అమలు చేయడం లేదని విమర్శించారు. ఉద్యోగుల మధ్య విభజన పేరుతో విభేదాలు సృష్టిస్తూ ఐక్యతను దెబ్బతీస్తున్నారని చెప్పారు. ఉద్యోగ సంఘాలతో మాట్లాడే సంప్రదాయాన్ని ప్రభుత్వ పెద్దలు గాలికొదిలేశారన్నారు. ప్రాజెక్టులో ఒకే కేడర్ ఉద్యోగులకు రకరకాల వేతనాలు చెల్లిస్తూ, కొత్త విధానాలను అమలు చేస్తున్నారని చెప్పారు. పాత వారికి జీతం పెంచకుండా, కొత్తగా నియమితులైన వారికి అదనపు జీతాలు చెల్లించే విధానాన్ని తీసుకొచ్చిందని తెలిపారు. దీనివల్ల సుదీర్ఘ కాలం పాటు సేవలందించే ఉద్యోగులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్ట్ టైం పేరుతో తక్కువ జీతాలు అమలు చేయడం సరికాదన్నారు. గత ఎన్నికలకు ముందు కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తామని నమ్మబలికి ఆ హామీని గాలికొదిలేశారని విమర్శించారు. దీనికితోడు సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తామన్న హామీ నెరవేర్చలేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు అమలు చేశామంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం, సమగ్ర శిక్ష ఉద్యోగులను ఎందుకు రెగ్యులర్ చేయడం లేదని ప్రశ్నించారు. 20 ఏళ్లుగా ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలు, కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్, పార్ట్ టైమ్ విధానాల్లోనే మగ్గుతున్నారని తెలిపారు. బస్సు యాత్ర చేసినంత మాత్రాన సామాజిక న్యాయం జరగదని, ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇస్తే కుటుంబాలకు భరోసా ఉంటుందన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే త్వరలో జిల్లా, రాష్ట్ర కమిటీలు, అన్ని సంఘాలు, ఉద్యోగులతో కలిసి సమ్మె నోటీసు ఇచ్చి, డిసెంబరులో సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. సమావేశంలో సిఐటియు సీనియర్ నాయకులు ఎం.ఆదినారాయణ మూర్తి, లోకేష్, పైడి మురళీకృష్ణ, టి.జయభారతి, కె.శారద, బి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల ప్రత్యేక డ్రైవ్ విజయవంతం

ప్రజాశక్తి - కొత్తూరు, ఆమదాలవలస

ఓటర్ల నమోదు, సవరణలకు సంబంధించి ఈనెల 4, 5 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్ విజయవంతమైనట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. కొత్తూరు మండలం పారాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఆమదాలవలస మున్సిపాల్టీలోని 14వ వార్డులో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో నమోదైన ఓటర్ల దరఖాస్తులను పరిశీలించారు. ఓటర్ల నమోదు, తొలగింపు, చేర్పులతో పాటు పలు అంశాలపై బిఎల్‌ఒలకు సూచనలు చేశారు. ఫారం-6, 7, 8 నమోదులో ఎటువంటి అభ్యంతరాలు ఉన్నాయా అని ఆమదాలవలసలోని 32వ పోలింగ్ కేంద్రంలో టిడిపికి చెందిన బిఎల్‌ఎ కూన రామును ప్రశ్నించారు. ఎటువంటి అభ్యంతరాలు, ఇబ్బందుల్లేవని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఎల్‌ఒలు వారికి కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాల స్వీకరణను సమగ్రంగా పరిశీలన చేయాలన్నారు. 18 ఏళ్ల నిండిన యువత కొత్తగా ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు ఈ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం ఎంతో ఉపయోగపడిందన్నారు. ఓటర్ల జాబితాలో డబుల్ ఎంట్రీ ఉండరాదన్నారు. ఒకే కుటుంబం ఒకే బూత్‌లో ఉండాలని స్పష్టం చేశారు. బిఎల్‌ఒల సమక్షంలో ఓటర్ల నమోదు చేయాలని చెప్పారు. ఓటర్లను చైతన్యపరిచేందుకు ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు ఎం.చక్రవర్తి, దువ్వాడ అమర్నాథ్, డిటిలు మురళీధర్ నాయక్, అనంత కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.




కొత్తూరు : అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

సంఘీభావ దినాన్ని విజయవంతం చేయాలి

అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నాయకుల పిలుపు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ రైతాంగ, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ శ్రీకాకుళం నగరంలో ఈనెల ఆరో తేదీన నిర్వహించే కార్మిక, కర్షక సంఘీభావ దినాన్ని జయప్రదం చేయాలని అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో అఖిలపక్ష రైతు, కార్మిక సంఘాల నాయకులు మాట్లాడారు. దేశవ్యాప్త కార్మిక, కర్షక సంఘీభావ దినం సందర్భంగా వెయ్యి రోజుల విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేక ఉద్యమానికి అభినందనలు తెలపాలని పిలుపునిచ్చారు. కార్మిక, రైతు, ప్రజా ఉద్యమాలకు అండగా నిలుస్తున్న న్యూస్ క్లిక్ పోర్టల్‌పై మోడీ ప్రభుత్వం కక్ష కట్టిందన్నారు. ప్రత్యేకించి సంయుక్త కిసాన్ మోర్చా నడిపిన రైతు ఐక్య ఉద్యమానికి మద్దతుగా నిలబడిందన్న కారణంగా కక్షసాదింపు చర్యలకు పూనుకుందని విమర్శించారు. న్యూస్ క్లిక్‌పై పెట్టిన అక్రమ కేసుల ఎఫ్ఐఆర్ కాపీలను తగులబెట్టాలని పిలుపులో భాగంగా ఉదయం పది గంటలకు అంబేద్కర్ జంక్షన్ వద్ద నిర్వహించే కార్యక్రమంలో రైతులు, కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు చిక్కాల గోవిందరావు, ఐఎఫ్‌టియు జిల్లా కార్యదర్శి డి.గణేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి తేజేశ్వరరావు

యువత ఓటర్లుగా నమోదు చేసుకోవాలి

- ఇప్పటికే ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల
- మార్పులు, చేర్పులకు డిసెంబరు 9 వరకు గడువు
- జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఓటు హక్కు కీలకమని, అర్హులైన యువత ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాలను అనుసరించి వచ్చే ఏడాది నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికల కోసం ముసాయిదా ఓటర్ల జాబితాను నియోజకవర్గాల వారీగా వెల్లడించామన్నారు. జాబితాలో చేర్పులు, మార్పులకు డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. జాబితాలో ఓటు లేకుంటే తిరిగి నమోదు చేసుకునేందుకు వీలు కల్పించామన్నారు. అన్ని వర్గాల సహకారంతో ఓటర్ల జాబితా ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.


జిల్లాలో ఇప్పటికే ఓటర్ల ముసాయిదా జాబితా విడుదలైంది. ఇందులో లోపాలు ఉంటే ఎవరికి ఫిర్యాదు చేయాలి?

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల డ్రాఫ్ట్ రోల్ (ముసాయిదా జాబితా)ను ఇప్పటికే విడుదల చేశాం. డిసెంబరు తొమ్మిదో తేదీ వరకు ఓటర్ల జాబితాలో మార్పులకు, చేర్పులకు 45 రోజులు అవకాశం కల్పించాం. ఫిర్యాదుల కోసం నవంబరు 4, 5, డిసెంబరు 2, 3 తేదీల్లో వీలు కల్పించాం. పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులతో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నాం. 12వ తేదీ వరకు స్వీకరించిన ఫిర్యాదులను పరిశీలిస్తాం. వాటిని డిసెంబరు 26వ తేదీ నాటికి పరిష్కరించి జనవరి ఒకటో తేదీన నుంచి చివరి దశ పరిశీలిస్తాం. చివరిగా ఎలక్ట్రోల్ పబ్లికేషన్‌ను జనవరి 5న విడుదల చేస్తాం.

ఓటర్ల నమోదు కోసం నిర్వహించిన ప్రత్యేక క్యాంపెయిన్ స్పందన ఎలా ఉంది?

జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో 18,27,143 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 9,08,440 మంది పురుషులు, 9,18,528 మహిళా ఓటర్లు ఉన్నారు. వీరి కోసం జిల్లాలో 2,357 పోలింగ్ కేంద్రాలను ఇప్పటికే గుర్తించాం. ప్రతి వెయ్యి మంది జనాభాలో 758 మంది ఓటర్లు ఉన్నారు. సర్వీసు ఓటర్ల సంఖ్య 16,162 మంది వరకు ఉన్నారు. డిఫెన్సు, ఇతర కేంద్ర సర్వీసుల్లో ఉన్న సర్వీసు ఓటర్లు ఎక్కువగా ఉన్న జిల్లాగా రాష్ట్రంలోనే మొదటిస్థానంలో ఉన్నాం. 50 వేల మంది వరకూ కొత్తగా ఓటర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. కానీ, ఇప్పటి వరకు 20 వేల మంది యువకులు మాత్రమే నమోదు చేసుకున్నారు. మిగిలిన వారు డిసెంబరు 9లోగా తమ పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఇందులో భాగంగా ఈనెల 4, 5 తేదీల్లో ఓటర్ల నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించాం. ఈ క్యాంపెయిన్ విజయవంతమైంది. ఓటర్ల నమోదుకు విస్తృత ప్రచారం, ప్రత్యేకంగా శిబిరాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం. ఫైనల్ రోల్‌ను మదర్ రోల్‌గా పరిగణిస్తాం. జనవరి తర్వాత ఓటర్లుగా నమోదైతే వారిని సప్లిమెంటరీ జాబితాల్లో పొందుపరుస్తాం.





ఓటరుగా నమోదుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

అర్హత ఉన్న ప్రతిఒక్కరూ ఓటు హక్కు పొందేలా బిఎల్‌ఒ స్థాయి నుంచి చర్యలు చేపడుతున్నాం. కలెక్టర్ ఆదేశాలను అనుసరించి అన్ని వర్గాలు సమన్వయం కోరుతున్నాం. ఇప్పటికే వివిధ రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకునేందుకు సమావేశాలు నిర్వహిస్తున్నాం. బిఎల్‌ఒ స్థాయి నుంచి ఎఇఆర్‌ఒ, విఆర్‌ఒ స్థాయిలో ఫిర్యాదుల పరిష్కారానికి వ్యక్తిగతంగా ఐదు కంటే ఎక్కువ ఫిర్యాదులను అంగీకరించడం లేదు.

ఓటరు జాబితాలో పేర్లు ఉన్నదీ? లేనిదీ ఎలా గుర్తించగలం?

ఓటర్లు తమకు ఓటు హక్కు ఉన్నది, లేనిదీ తెలుసుకునేందుకు బూత్ లెవల్ ఏజెంట్లను సంప్రదించాలి. ఇసిఐ వెబ్సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఓటర్స్, ఇసిఐ.జిఒవి.ఇన్ ద్వారా కూడా సమాచారాన్ని తెలుసుకోవచ్చు. ఓటర్ హెల్ప్ లైన్ (విహెచ్‌ఎ) అనే యాప్‌ను డౌన్లోడ్ చేసుకుని ఓటు వివరాలను తెలుసుకోవచ్చు. అలాగే టోల్ ఫ్రీ నంబరు 1950 ద్వారా కూడా సమాచారం తెలుసుకోవచ్చు. జాబితాలో పేరు లేకపోతే ఫారం-6ను సమర్పించడం ద్వారా ఓటు హక్కును తిరిగి పొందవచ్చు.

ఇవిఎంల తనిఖీలు ఎంతవరకు పూర్తి చేశారు?

ఎలక్ట్రానిక్ ఓటరు యంత్రాలను కలెక్టరేట్‌లోని గోదాముల్లో పరిశీలన చేపడుతున్నాం. సాంకేతిక నిపుణుల బృందంతో సాంకేతికపరమైన అనేక అంశాలను, రాజకీయ పార్టీల ప్రతినిధుల అనుమానాలను నివృత్తి చేస్తున్నాం.

24 వేల లీటర్ల బెల్లపుఊటలు ధ్వంసం

శ్రీకాకుళం : ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో నాటుసారా తయారీ స్థావరాలపై స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు, ఒడిశా పోలీసులు సంయుక్తంగా ఆదివారం దాడులు చేపట్టారు. ఒడిశా సరిహద్దు గ్రామాలైన చిన్నబుర్జోల, పెద్దబుర్జోల, దుర్గం, ఏక్మర, మారంగిలో నాటుసారా తయారీ స్థావరాలపై సంయుక్త దాడులు చేశారు. ఈ దాడుల్లో 24 వేల లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఆ స్థావరాల్లో తయారైన 220 లీటర్ల నాటుసారాను కూడా ధ్వంసం చేశారు. దాడుల్లో ఎస్‌ఇబి ఇన్‌స్పెక్టర్ డి.అనిల్ కుమార్, బి.మురళీధర్, బి.నరసింహమూర్తి, కె.లక్ష్మీనాయుడు, సబ్ ఇన్‌స్పెక్టర్లు వి.వేణుగోపాల్, జె.సంధ్యారాణి, కె.కృష్ణారావు, ఎస్‌ఇబి, ఒడిశా పోలీసులు పాల్గొన్నారు.


ఎండిన వరి పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్

రైతు గోడు వినిపించదా?

ప్రజాశక్తి- కవిటి

నియోజకవర్గంలో 60 శాతంపైగా పంట వర్షాలు లేక ఎండిపోతే ప్రభుత్వానికి కనిపించడం లేదని, నాయకులకు రైతుల గోడు వినిపించదా? అని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని పురియాదల రెవెన్యూ పరిధిలో పాడైన వరి పంట పొలాలను ఆదివారం పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో నియోజకవర్గంలో కొన్ని ప్రాంతాల్లో నాట్లు వేయపోగా, వేసిన ప్రాంతాల్లో పూర్తిగా ఎండిపోయిన పరిస్థితి కనిపిస్తోందని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో జిల్లాలోనే ఒక్క మండలం లేకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. రైతులు అప్పులు చేసి ఆరుగాలం కష్టపడిన వరుణుడు కరుణించక అప్పుల ఊబిలోకి కూరుకుపోతున్నారని వాపోయారు. మొదటి నుంచి కరువు మండలాల గుర్తింపులో తాత్సారం చేసిన ప్రభుత్వం చివరి నిమిషంలో రాష్ట్రంలో కొన్ని మండలాలు ప్రకటించి చేతులు దులుపుకుందని విమర్శించారు. ఇప్పటికైనా రైతుల దయనీయ పరిస్థితి గుర్తించి వారికి న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్, బెందాళం వెంకటరావు, వజ్జ రంగారావు, బెందాళం కామరాజు, బి.చక్రవర్తి, బి.చక్రధర్, బి.సురేష్, బి.వెంకటరావు, గార గిరి పాల్గొన్నారు.


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజా రక్షణ భేరి పోస్టర్ ఆవిష్కరణ

హిరమండలం : ఈ నెల 15న విజయవాడలో ప్రజా రక్షణ భేరి భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ తెలిపారు. హిరమండలంలో ఆదివారం మండల కమిటీ సమావేశం నిర్వహించి ప్రజా రక్షణ భేరి పోస్టర్‌ను అవిస్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం అసమానతలు అభివృద్ధి కోసం రాష్ట్రవ్యాప్తంగా ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర చేపడుతున్నామని తెలిపారు. ముగింపు సందర్భంగా నిర్వహిస్తున్న బహిరంబసభలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.అప్పారావు, నిమ్మక అప్పన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా కోహ్లీ పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి- పొందూరు

ఇండియన్ క్రికెటర్ విరాట్ కోహ్లీ 35వ పుట్టినరోజు వేడుకలను ఆదివారం పట్టణంలో అభిమాను లు ఘనంగా నిర్వహించారు. విరాట్ కోహ్లీ భారీ కటౌట్ ఏర్పాటు చేసి పూలదండతో అలంకరించి కేక్ కట్ చేసి స్వీట్స్ పంచిపెట్టారు. బాణసంచా కాల్చి, డాన్సులు చేశారు.


కోహ్లీ కటౌట్ ముందు అభిమానులు

రూపం కోల్పోయిన ముత్యాలమ్మ కోనేరు

- పేరుకుపోయిన చెత్తా చెదారం
- మూలకు చేరిన చిన్నారుల ఆట పరికరాలు

ప్రజాశక్తి- పలాస

ఒకప్పుడు ఆ పార్కు వృద్ధులతో, మహిళలతో, చిన్నారులతో కలకలలాడేది. ఒకవైపు వాకర్స్ వాకింగ్ చేస్తుండగా... మరో వైపు చిన్నారులు ఆట పరికరాలతో ఆట్లాడుకుంటూ సందడి చేసేవారు. మరోవైపు కోనేరులో జలకాలాడుతూ ఆనందంగా గడిపేవారు. ప్రస్తుతం ముత్యాలమ్మ కోనేరు (నెహ్రూ పార్కు) ఆ పరిస్థితి కనుమరుగైంది. కొంత మంది వ్యక్తులు, మున్సిపల్ అధికారులు కలిసి లక్షలాది రూపాయలు బిల్లులు చేసి అవినీతికి పాల్పడ్డారన్న విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి.

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించే ముత్యాలమ్మ కోనేరు పార్కు మురుగు కూపంగా మారింది. 2002లో జరిగిన మొట్టమొదటి మున్సిపల్ ఎన్నికల్లో వజ్జ బాబూరావు మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన వెంటనే లక్షలాది రూపాయలు మున్సిపల్ నిధులతో ముత్యాలమ్మ కోనేరును పార్కుగా అభివృద్ధి చేసి అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డితో ప్రారంభించారు. మూడేళ్ల క్రితం ప్రత్యేకాధికారి పాలన రావడంతో పార్కును నామరూపాలు లేకుండా పోయింది. పార్కు అభివృద్ధి పేరుతో రూ.74 లక్షలు మున్సిపల్ నిధులు ఖర్చు పెట్టి రూపురేఖలు మార్చేశారు. తరువాత జరిగిన ఎన్నికల్లో వైసిపి అధికారంలోకి వచ్చినా పార్కు అభివృద్ధి వైపు పాలకులు గాని, అధికారులు గాని దృష్టిసారించకపోవడం ప్రజలకు శాపంగా మారింది. వాకర్స్ సంఘంగా రూ. 4 లక్షలు సేకరించి నడక దారిని శుభ్రం చేసినా... అదీ పాడైపోయింది. కాపలాదారుడు లేకపోవడంతో పార్కుకకు భద్రత లేకపోయింది. అలాగే పార్కు చుట్టూ గతంలో ఉన్న ఫెన్సింగ్ తొలగించారు. దీనిపై వాకర్స్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, కార్యదర్శి రామానంద పండిత్ మాట్లాడుతూ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖలకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముత్యాలమ్మ కోనేరు అభివృద్ధికి కృషి చేయాలని కోరుతున్నారు.

ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్‌ను వివరణ కోరగా... ముత్యాలమ్మ కోనేరు వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. త్వరలో పార్కును సుందరంగా తీర్చిదిద్దుతామని తెలిపారు.


అధ్వానంగా ఉన్న కోనేరు


మూలకు చేరిన పరికరాలు

రేపట్నుంచి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యాన ఈనెల 7 నుంచి ఫిబ్రవరి 28 వరకు వివిధ దశల్లో చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నామని, ఈ సంబరాలను విజయవంతం చేయాలని కొత్తకోట అప్పారావు, బొడ్డేపల్లి మోహనరావులు అన్నారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జనవిజ్ఞాన వేదిక సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జెవివి రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ ఆలిండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ పిలుపుమేరకు దేశవ్యాప్త సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌లో భాగంగా జనవిజ్ఞాన వేదిక దేశవ్యాప్త శాస్త్ర విజ్ఞాన ప్రచార ఉద్యమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సైంటిఫిక్ టెంపర్ క్యాంపెయిన్‌ను జిల్లాలో అన్ని మండలాల్లో పట్టణాల్లో గుర్తించిన గ్రామాల్లో విజయవంతం చేయాలన్నారు. ఈనెల 10న పాఠశాల స్థాయిలో జరగనున్న చెకుముకి సైన్స్ టెస్ట్ పేపర్లను మండల కన్వీనర్‌లకు అందజేశారు. ఈ సమావేశంలో సాయి శ్రీనివాస్ శర్మ, జెవివి జిల్లా గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి జనార్ధనరావు, ఉపాధ్యక్షులు పాలకొండ కూర్మారావు, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సంపతిరావు కిషోర్ కుమార్, జిల్లా నాయకులు లండ బాబురావు, దమయంతి, సామ సంజీవరావు, సిహెచ్ ఉమామహేశ్వరరావు, అగతమూడి వాసుదేవరావు, తమ్మినేని వైకుంఠరావు, పేడాడ వేదవతి, ఎస్ రాజా, శ్రీనివాసరావు, ఎల్ సుందరరావు, సూర్యనారాయణ, రామకృష్ణారావు, గౌరీ శంకర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గిరిధర్

సకాలంలో జీతాలు చెల్లించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉపాధ్యాయులు, ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి సరికాదని, నెలవారీ 1వ తేదీన క్రమం తప్పకుండా జీతాలు కూడా చెల్లించడం లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం యూటిఎఫ్ జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో రవీంద్ర మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం గడిచిన కొన్ని నెలల నుంచి జీతాలు ఎప్పుడిస్తారో తెలియని అయోమయ పరిస్థితిని కల్పించారని విమర్శించారు. నవంబరు నెల జీతాలు ఇంతవరకు ఉపాధ్యాయ, ఉద్యోగులకు చెల్లించలేదన్నారు. మరోవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ కొత్త విధానాలను తీసుకొస్తున్నారని, ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకునేం దుకు ఉపాధ్యాయు లందరూ మరింత నిబద్ధతతో పనిచేయాలన్నారు. పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్ పర్యటనలు విద్యా రంగాన్ని నష్టపరిచే విధంగా ఉన్నాయని, ఆయన వైఖరిలో మార్పు రావాలని డిమాండ్ చేశారు. ఈ ఏడాది జిల్లా కౌన్సిల్ సమావేశాలు డిసెంబర్ 3న కోటబొమ్మాళిలో నిర్వహించడం జరుగుతుందని, ఉపాధ్యాయులు ఎక్కువ సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సమావేశంలో కిషోర్ కుమార్, జిల్లా గౌరవ అధ్యక్షులు వైకుంఠరావు, సహాధ్యక్షులు ఎల్.బాబూరావు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఉమాశంకర్, అర్.దమయంతి, జిల్లా కార్యదర్శి దాలయ్య, అన్నాజీరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవీంద్ర

'తెప్పల'కు పురస్కారం

పలాస : జిల్లా రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యాన శ్రీకాకుళం బాపూజీ కళా మందిరంలో మూడు రోజుల పాటు రాష్ట్ర పరిషత్ నాటికల పోటీలు నిర్వహించారు. ఇందులో డాక్టర్ తెప్పల కృష్ణమూర్తికి కళాకారుల సమాఖ్య పురస్కారం లభించింది. ఆయనకు నిర్వాహకులు పురస్కారాన్ని అందించి దుశ్శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సమాఖ్య అధ్యక్షులు చిట్టి వెంకటరావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.ఎం.జె.బాబు, ఎపి నాటక కళా పరిషత్ సమాఖ్య అధ్యక్షులు బుద్దాల వెంకట రామారావు, గౌరవ అధ్యక్షులు రాము, లింగస్వామి, కార్యదర్శి దేవ్ పాల్గొన్నారు.


పురస్కారాన్ని అందుకుంటున్న కృష్ణమూర్తి



యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని భావనాపురం కాలనీకి చెందిన సవర నరసింహులు (32) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాగుడుకు బానిస కావడంతో కుటుంబ సభ్యులు, బంధువులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై శనివారం రాత్రి పురుగుల మందు తాగి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు పలాస ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉందని చెప్పి ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు టెక్కలి జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేశారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య సవర తేజేమ్మ, కుమారులు అభిషేక్, అక్షయ ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ నర్సింగరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


నరసింహులు (ఫైల్)

పెళ్లయిన మూడు నెలలకే...

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

ప్రజాశక్తి- జి.సిగడాం

మండలంలోని మెలగాడ పంచాయతీ గొర్సిపూడిలో పెళ్లయిన మూడు నెలలకే వివాహిత దమ్మ మౌనిక (18) అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దమమ్మ చిన్నారావు ఖర్గపూర్‌కు చెందిన మేనకోడలు మౌనికతో ఆగస్టు 18న వివాహమైంది. పెళ్లెయిన కొద్ది రోజుల తరువాత వీరి మధ్య మనస్పర్ధలు వచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆదివారం 11 గంటలకు రోజులానే చిన్నారావు, మృతురాలి తాత, అమ్మమ్మ పొలం పనులకు వెళ్లారు. పనులు ముగించుకుని మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి వచ్చి చూసేసరికి ఉరివేసుకుని కనిపించింది. వెంటనే కిందకు దించి చూసేసరికి అప్పటికే మృతి చెందింది. దీంతో కన్నీరుమున్నీరుగా విలపించారు. సమాచారం అందుకున్న సిఐ ఆదాం, లావేరు ఎస్ఐ కోటేశ్వరరావు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి తల్లిదండ్రులు హైమ, వెంకటేష్‌లు ఖర్గపూర్‌లో బయలు దేశారని, వారు ఫిర్యాదు ఇచ్చిన తరువాత కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.


మౌనిక మృతదేహం

ఇద్దరికి గాయాలు

కోటబొమ్మాళి: మండలంలోని పాడుగుపాడు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీకాకుళం ఇల్లీసుపురానికి చెందిన ఆటోడ్రైవర్ చక్క గణేష్, బొంబాయ్ కాలనీకి చెందిన కళాకారుడు బి.శ్యాంసుందర్ గాయపడ్డారు. వీరు పలాసలో కళాప్రదర్శన నిర్వహించుకొని తిరిగి ఆటోలో ఐదుగురు వస్తున్నారు. పొడుగుపాడు వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన లారీ స్వల్పంగా ఢీకొనడంతో ఆటో అదుపు తప్పి రోడ్డు పక్కకు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోడ్రైవర్‌తో పాటు ఆ పక్కన కూర్చున్న శ్యాంసుందర్ బయటకు తుళ్లి గాయపడ్డారు. శ్యాంసుందర్‌కు వెడమ కాలు విరిగిపోగా, గణేష్‌కు గాయాలయ్యాయి. వీరిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగతా వారు సురక్షంగా ఉన్నారు. పోలీసులను వివరణ కోరితే సమాచారం అందలేదని తెలిపారు.


దెబ్బతిన్న ఆటో

బంద్‌ను విజయవంతం చేయాలి


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి- పలాస

విశాఖ ఉక్కు కార్మికుల పోరాటానికి ఈ నెల 8తో వెయ్యి రోజులు పూర్తవుతుందని, సందర్భంగా విశాఖ స్టీల్ ప్లాంట్ రక్షణ, కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు అదే రోజు రాష్ట్రవ్యాప్త విద్యా సంస్థల బంద్‌కు విద్యార్థి, యువజన సంఘాలు పిలుపునిచ్చారని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వి.జాన్సన్‌బాబు అన్నారు. ఈ మేరకు కాశీబుగ్గ ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టల్‌లో ఆదివారం సమావేశం నిర్వహించి అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా జాన్సన్‌బాబు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్‌కుమార్, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.యుగంధర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిహెచ్.రవిలు మాట్లాడారు. విద్యా సంస్థల బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. 32 మంది ప్రాణ బలిదానం, 23 వేల ఎకరాల విస్తీర్ణంలో నిర్మించామని అన్నారు. మూడు లక్షల కోట్ల రూపాయలు విలువ చేసే ఆస్తులతో లక్షల మందికి ఉపాధిని కల్పిస్తూ విశాఖపట్నం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటు పరం చేయడం సరికాదన్నారు. అదానీ, అంబానీలకు కట్టబెట్టడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఈ బంద్ సందర్భంగా ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లానని అన్నారు. ఈ క్రమంలో తమ సంఘాల నుంచి అన్ని రకాలుగా సహకారం ఉంటుందని స్పష్టం చేశారు.

ఆర్‌టిసి కార్మికుల ఆందోళన


ఆందోళన చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

ప్రజాశక్తి- పలాస

ఆర్‌టిసి ఉద్యోగులు కార్మికులపై జులుం ప్రదర్శిస్తున్నారని, డిపో యాజమాన్యం తీరు మార్చుకోవాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎ.దిలీప్‌కుమార్ అన్నారు. పలాస ఆర్‌టిసి డిపో వద్ద ఆదివారం మధ్యాహ్నం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన గుర్తింపును పట్టించుకోకుండా డిపో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఒకే డ్రైవరు, ఒకే కండక్టర్‌తో 870 కిలోమీటర్లు బస్సుతో తిరగమని బలవంతం చేయడం దారుణమన్నారు. ఒకవేళ బస్సులో తిరిగిన సమయంలో ఏమైనా ప్రమాదం సంభవిస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అధికారుల తీరు మార్చుకోకపోతే కార్మికులంతా ఐక్యంగా ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎల్.ఎ.రావు, ఎల్.వి.రావు, టి.సి.హెచ్.వి.రావు పాల్గొన్నారు.

మాజీ అంగన్వాడీ కార్యకర్తపై దౌర్జన్యం

ప్రజాశక్తి- ఆమదాలవలస

మండలంలో నెల్లిపర్తి గ్రామానికి చెందిన పూర్వ అంగన్వాడీ కార్యకర్త శెట్టి పద్మపై అదే గ్రామానికి చెందిన వైసిపి సర్పంచ్ భర్త మానుకొండ వెంకటరమణ ఆదివారం దౌర్జన్యానికి దిగిన సంఘటన చోటు చేసుకుంది. నెల్లిపర్తిలో నివాసముంటున్న శెట్టి పద్మ గతంలో గ్రామంలో అంగన్వాడీ కార్యకర్తగా విధులు నిర్వహించారు. ఏడాది క్రితం రాజకీయ కక్షతో ఆమెను విధుల నుంచి తొలగించారు. అప్పటి నుంచి ఆమె రామ మందిరం వద్ద సత్యసాయి సేవకురాలిగా బాలవికాస్ కేంద్రం నిర్వహిస్తున్నారు. 20 మంది బాలలకు స్వచ్ఛందంగా ఆట పాటలు, విద్యాబుద్ధులు నేర్పిస్తున్నారు. ఆదివారం రామ మందిరం వద్దకు సర్పంచ్ భర్త చేరుకుని ఇక్కడ బాలవికాస్ కేంద్రం నిర్వహించరాదని బాలలను, శెట్టి పద్మను బయటకు తోసేసి రామ మందిరానికి తాళాలు వేశారు. దీంతో బాలవికాస్ కేంద్రం చిన్నారులు ఎండలోనే వీధిలో నిలబడిన సంఘటన పలువురిని కలచివేసింది. సమాచారం అందుకున్న సత్యసాయి సేవా సమితి జోనల్ కన్వీనర్ మునగవలస జనార్థనరావు అక్కడకు చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. సర్పంచ్ భర్త ఇచ్చిన సమాచారంతో ఇద్దరు పోలీసులు అక్కడకు చేరుకొని వివాదాలకు కారణమైన ఆలయంలో ఇకనుండి బాలవికాస్ కేంద్రం నిర్వహించరాదని పద్మకు తెలియజేశారు. మీకు ఫిర్యాదు ఎవరు ఇచ్చారంటూ పోలీసులను పద్మ ప్రశ్నించగా తనపై దురుసుగా వ్యవహరించి సమాధానం చెప్పారని ఆమె కన్నీటి పర్యంతమయ్యారు. ఇదే విషయమై ఎస్ఐ వై.కృష్ణను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు రాలేదని, ఫోన్ ద్వారా కొందరు ఇచ్చిన సమాచారంతో పోలీసులను పంపించడం జరిగిందని ఫిర్యాదు చేస్తే దర్యాప్తు చేస్తామని తెలిపారు.


ఎండలోనే నిల్చొన్న చిన్నారులు

సంక్షేమ వారధి జగన్

వైసిపి జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్


టెక్కలి రూరల్ : మాట్లాడుతున్న కృష్ణదాస్

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

పేద ప్రజలకు సంక్షేమ వారధిగా జగన్ నిలిచారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక ఎస్ కన్వెన్షన్ హాల్లో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. సిఎం జగన్ మేనిఫెస్టోలో వంద శాతం అమలు చేశారని అన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయంపై దృష్టిసారించారని పేర్కొన్నారు. నాడు-నేడు ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేశారని అన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయిలో వైద్య సేవలు, సదుపాయాలు కల్పించారని అన్నారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందజేస్తున్నామని అన్నారు. దళారీ వ్యవస్థ లేకుండా సచివాలయం ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని అన్నారు. పేదలందరికీ జగనన్న ఇళ్లు మంజూరు చేశారని అన్నారు. అనంతరం టెక్కలి డీగ్రీ కళాశాల నుంచి సామాజిక సాధికార బస్సు యాత్రతో బైక్ ర్యాలీ నిర్వహించి పలాస వెళ్లారు. సమావేశంలో వైసిపి ఉత్తరాంధ్ర ఇన్‌ఛార్జి వై.వి.సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణి, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేడాడ తిలక్, జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: సామాజిక న్యాయాన్ని పాటించిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డేనని వైసిపి మండల అధ్యక్షులు నూక సత్యరాజు అన్నారు. మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచ్ నాయకులు సామాజిక సాధికార బస్సు యాత్రకు సంఘీభావంగా బైక్ ర్యాలీ నిర్వహించి టెక్కలి చేరుకున్నారు. ముందుగా పిఎసిఎస్ అధ్యక్షులు బాడాన మురళి జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మండల విప్ బొడ్డు అప్పన్న, సర్పంచ్‌లు కాళ్ల సంజీవరావు, బోయిన కృష్ణారావు, బలగ సూర్యారావు, బమ్మిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నందిగాం : వైసిపి చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు నందిగాంలో వైసిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. పలాస వెళ్తున్న బస్సు యాత్రకు నందిగాం వద్ద కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు బైకులతో నందిగాం నుంచి పలాస వరకు ర్యాలీ వెళ్లారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన


మెళియాపుట్టి : పరిశీలిస్తున్న వెంకట్రామన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న 139 కేంద్రాల్లో ఈనెల 4, 5 తేదీల్లో ప్రత్యేక ఓట్ల గుర్తింపు ప్రక్రియను విజయవంతంగా నిర్వహించామని సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఎపిసి ఐవి రమణమూర్తి అన్నారు. ఆదివారం శ్రీకాకుళం నగరంలో పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. నగరంలో 139 పోలింగ్ కేంద్రాల పరిధిలో 1,41,762 ఓట్లు ఉన్నాయని స్వేచ్ఛగా, సజావుగా ఎన్నికల నిర్వహణకు ఓటర్ల జాబితా ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. అధికారులు ఫారం- 6, 7, 8 ద్వారా సరిచూసుకునే అవకాశం ఉందన్నారు. డిసెంబర్ 9 వరకు కొత్త ఓటర్ల నమోదు జరుగుతుందని, జనవరి 5న తుది జాబితా సిద్ధమవుతుందన్నారు.

మెళియాపుట్టి : మండలంలో మర్రిపాడు-సి చింతలపోలూరులో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని జెడ్‌పి సిఇఒ కె.వెంకట్రామన్ ఆదివారం పరిశీలించారు. 18 నిండిన ప్రతిఒక్కరికీ ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని బిఎల్‌ఒలకు సూచించారు. మృతి చెందిన వారి పేర్లను తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సరోజని, ఆర్ఐ వైకుంఠరావు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలో రెండు రోజులు పాటు నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు డ్రైవ్‌లో 227 దరఖాస్తులు వచ్చాయని తహశీల్దార్ వై.వి.పద్మావతి తెలిపారు. అందులో నమోదు 149, తొలగింపులు 22, సవరణలు 56 వచ్చాయని అన్నారు.

జి.సిగడాం : అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండాలనితహశీల్దార్ పి.వేణుగోపాలరావు అన్నారు. మండలంలో ఆనందపురం, ముసినివలస, ముక్కుపేట గ్రామాల్లో తహశీల్దార్ వేణుగోపాలరావు, ఆర్ఐ రామచంద్రరావులు ఓట్లు మార్పు, చేర్పులను పరిశీలించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎన్ఇఆర్

దిగజారుడు వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరిపై వైసిపి నాయకుల దిగజారుడు ఆరోపణలు చేయటం సరికాదని బిజెపి జిల్లా అధ్యక్షులు నడుకుదిటి ఈశ్వరరావు ఖండించారు. ఆదివారం ఎన్ఇఆర్ క్యాంపస్‌లో ఎచ్చెర్ల అసెంబ్లీ బిజెపి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురందేశ్వరిపై వైసిపి ఎంపీ విజయసాయిరెడ్డి సామాజిక మాధ్యమాల వేదికగా చేసిన వ్యాఖ్యలు సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అరాచక, అవినీతి పాలనపై ప్రశ్నిస్తున్న పురందేశ్వరిపై వ్యక్తిగత దూషణలు చేయడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల నాయకులు లెంక అప్పలనాయుడు, ఇజ్జడ శ్రీనివాసరావు, ఎస్.నాగేశ్వరరావు, ఉప్పలపాటి రాజేష్ వర్మ, దుక్క ఆదినారాయణ, డి.రాజేంద్ర, మన్నె సురేష్ కుమార్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణిత ప్రతిభా పరీక్ష

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 9, పది తరగతి విద్యార్థులకు మండలస్థాయి గణిత ప్రతిభ అన్వేషణ పరీక్ష వజ్రపుకొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ఈ పరీక్షకు పరిశీలకుడుగా మెళియాపుట్టి మండల ప్రతినిధి ఎస్.చక్రధర్ వ్యవహరించారు. మొత్తం 161 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో టాప్‌లో నిలిచిన ఐదుగురు విద్యార్థులు డిసెంబరు 9న నిర్వహించనున్న జిల్లాస్థాయి పరీక్ష హాజరవుతారని మండల ప్రతినిధి చింత ఉమారావు తెలిపారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, సురేష్‌కుమార్, సోమేశ్వరరావు, ప్రకాష్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

నందిగాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని గణిత ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యాన 9, పది తరగతుల విద్యార్థులకు ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు మండలం నుంచి 120 మంది విద్యార్థుల హాజరయ్యారు. అందులో పది మందికి ఎంపికయ్యారని గణిత ఉపాధ్యాయ సంఘం నాయకులు బంగారు తాతారావు, ఆర్.చంద్రశేఖరరావు, కుమారస్వామి తెలిపారు.


వజ్రపుకొత్తూరు : పరీక్ష రాస్తున్న విద్యార్థులు

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత, మెట్టూరు, కడుమ, నివగాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 9,10 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన గణిత ప్రతిభా పరీక్షలు 129 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు దండు ప్రకాశరావు, బాలరాజు, మహంతి, కె.వెంకటరావు, కాంతారావు, ఎల్.గోవర్ధనరావు, మాధవరావు, భాస్కరరావు, సంపత్ స్వాతి, జె.తిరుపతిరావు పాల్గొన్నారు.


నోటీసులు అందజేస్తున్న పోలీసు

వామపక్ష నాయకులకు నోటీసులు

పలాస : కాశీబుగ్గలో వైసిపి ఆధ్వర్యాన సామాజిక సాధికార బస్సు యాత్ర ఆదివారం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో సిపిఎం నాయకులు ఎన్.గణపతి, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్‌కు ఆదివారం పోలీసులు ముందస్తు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిరంకుశత్వానికి పోలీసులతో నోటీసులు ఇప్పించడం అందుకు నిదర్శనమన్నారు. వర్షాలు లేక పంట పోయినా కరువు జిల్లాగా ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. కరువు సహాయక చర్యలు చేపట్టకుండా ప్రభుత్వం చోద్యం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా జీడికి గిట్టుబాటు ధర కోసం జీడి రైతులు, వామపక్ష నాయకులు డిమాండ్ చేస్తున్నా పట్టించుకోకుండా వారి కోసం కనీసం మాట్లాడకుండా సాధికార బస్సు యాత్ర చేయడం వల్ల ఎవరికి ఉపయోగమని ప్రశ్నించారు. అక్రమ అరెస్టుల ద్వారా ప్రజా స్వామ్యాన్నిబ ఖూనీ చేస్తుందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా ప్రజలకు మేలు చేసే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

యాదవుల అభివృద్ధికి కృషి

వజ్రపుకొత్తూరు: యాదవుల అభివృద్ధికి కృషి చేస్తానని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి గౌతు శిరీష అన్నారు. మండలంలోని బెండి కొండ వద్ద ఆదివారం నిర్వహించిన యాదవుల సాధికార సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యాదవుల సామాజిక స్థితిగతులు దయనీయంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. టిడిపి అధికారంలోకి వస్తే యాదవులను బిసి ఎలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం ఆమెకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో యాదవ నాయకులు చిట్టిబాబు భుజంగరావు, ఇప్పిలి జగదీష్, లోడగల కామేశ్వరరావు, తాతారావు పాల్గొన్నారు.


శిరీషను సన్మానిస్తున్న యాదవులు



చిన్నారులతో హరగోపాల్

చిన్నారులకు చెస్ ఫెస్టివల్ టోర్నీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

చిన్నారులు చదువుల్తో, క్రీడల్లో రాణించి మంచి పేరు తెచ్చుకోవాలని, చదరంగం క్రీడతో క్రమశిక్షణ అలవడుతుందని ప్రముఖ వాణిజ్యవేత్త కొరాడ హరగోపాల్ అన్నారు. నగరంలో స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీలో దీపావళి ఫెస్టివల్ చిల్డ్రన్స్ చెస్ ఛాంపియన్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరిగింది. నగరంలోని వివిధ ప్రాంతాల్లోని చిన్నారులు పాల్గొని 6 రౌండ్లపాటు జరిగిన చెస్ పోటీల్లో ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొరాడ హరగోపాల్ మాట్లాడుతూ చదరంగం క్రీడతో మేధాశక్తి పెరుగుతుందని, క్రీడలో జిల్లా చిన్నారులు పాల్గొని చెస్ క్రీడను నేర్చుకోవడం, పోటీల్లో రాణిస్తుండటం అభినందనీయమన్నారు. అనంతరం చెస్ విజేతలు చిన్నారులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ కోచ్ భేరి చిన్నారావు, క్రీడాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు. విజేతలుగా బలివాడ జయంత్, గెల్లంకి అశ్రిత్, కెవిఎస్ఎస్ నిఖిల్, తనయ తనిష్క, కొరాడ రూపక్, పట్నాన సోనిస్, నారాయణశెట్టి జశ్విన్, జక్కం శ్రీసహస్రా, గొర్లె హన్సితానాయుడు, శిల్లా హర్షిత్, రౌతు రోషన్ కుమార్, కుర్మాన చరణ్‌తేజ్, బలివాడ మహన్య, దర్శిత్, కె.సోమేష్ విజేతలుగా నిలిచారు.



చిత్రపటాన్ని అందజేస్తున్న ఐజి హరి సూర్యప్రకాశ్

లాజిస్టిక్ కౌంటరు ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద లాజిస్టిక్ కౌంటర్‌ను ఆర్‌టిసి డైరెక్టర్ ఎ.రాజారెడ్డి ఆదివారం ప్రారంభించారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన ముందుగా అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆయనకు అనివెట్టి మండపంలో శేషవస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని ఐజి హరిసూర్యప్రకాశ్ అందజేశారు. అనంతరం ఆయన ఆర్‌టిసి బస్టాండ్, డిపోలను సందర్శించారు. కౌంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఆర్‌టిసి నిర్వహణతో పాటు సేవలను విస్తృతపరచడానికి అవసరమైన సూచనలు, సలహాలను తెలియజేయాలని ప్రయాణికులను కోరారు. అనంతరం జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కార్గో సేవలను సమీక్షించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.వెయ్యి కోట్ల లక్ష్యాలను నిర్దేశించినట్లు తెలిపారు. శ్రీకాకుళం ఒకటో డిపో గ్యారేజిని సందర్శించి అక్కడ మొక్కలు నాటారు. కార్యక్రమంలో కర్నూలు డిసిటిఎం కె.వి రమణ, గుంటూరు ఎటిఎం కమర్షియల్ విజయ్, రాజు, దివ్య, శ్రీకాకుళం 1, 2, టెక్కలి, పలాస డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

మొబైల్ అన్నా క్యాంటీన్‌కు 200 రోజులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పేదలకు అన్నం పెట్టాలన్న సంకల్పంతో టిడిపి ప్రభుత్వ హయాంలో మాజీ సిఎం చంద్రబాబు అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేశారని జిల్లా సర్వజన సంఘం అధ్యక్షులు గొండు శంకర్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఏడురోడ్ల కూడలిలో 200 రోజుల పాటు ప్రజలకు ఉచితంగా అన్నదానం చేస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. స్వర్గీయ ఎన్‌టిఆర్ పేదలందరికీ కూడు, గూడు, గుడ్డ అన్న నినాదంతో అనేక సంక్షేమ పథకాలను అమలు చేశారని, ఆయన తర్వాత సిఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు పేదలకు ఒకపూటైనా కడుపునిండా అన్నం పెట్టాలని అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేశారన్నారు. అదే స్ఫూర్తితో జగన్ ప్రభుత్వం నిలుపుదల చేసిన అన్నా క్యాంటీన్ల స్థానంలో మొబైల్ అన్నా క్యాంటీన్లను రూపకల్పన చేసి 200 రోజులుగా భోజనం అందజేస్తున్నామన్నారు. అంతకు ముందు పొట్టి శ్రీరాములు కూడలి నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో మాజీ ఎంపిపి గొండు జగదీష్, గొండు వెంకటరమణ మూర్తి, మూకళ్ల శ్రీనివాసరావు, బడగల వెంకటరమణమూర్తి, కొంక్యాన ఆదినారాయణ, శంకర్ పాల్గొన్నారు.

సలాం సైనికా...

ప్రజాశక్తి - కవిటి

దేశ సేవలో 30 ఏళ్ళ తరించి ఉద్యోగ విరమణ చేసిన మండలంలోని కొర్రాయిపుట్టుగకు చెందిన కొర్రాయి ఢిల్లేశ్వర్‌ను ఎన్ఎస్‌జి సంస్థ ఆదివారం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సంస్థ సభ్యులు మాట్లాడుతూ తన జీవితంలో అధిక సమయం దేశ సేవకు కేటాయించిన ఢిల్లేశ్వర్ ఎన్ఎస్‌జి సంస్థ వ్యవస్థాపక సభ్యుడిగా సంస్థకు అండగా నిలవడం తమలో మనోధైర్యం నింపిందన్నారు. అనంతరం ఢిల్లేశ్వర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమతమ పరిధిలో దేశ సేవకు అంకితం కావాలన్నారు. ఎప్పటికైనా సంస్థతో తన అనుబంధం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్‌జి సభ్యులు పాల్గొన్నారు.

నడిరోడ్డుపై బహిరంగ సభా!

ప్రజాశక్తి- పలాస

అధికారాన్ని అడ్డుపెట్టుకుని నడి రోడ్డుపై బహిరంగ సభ పెట్టి జనజీవన స్రవంతికి ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని, రానున్న ఎన్నికల్లో పశు సంవర్థకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును నడి రోడ్డుపై నిలబెట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ హేంబాబు చౌదరి అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నడి రోడ్డుపై బహిరంగ సభ పెట్టడం ద్వారా లోపలికి బస్సులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. పట్టణ ప్రజలతో పాటు రోగులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రెండు రోజులుగా రాకపోకలు జరగకుండా బారికేడ్లస్ ఏర్పాటు చేయడం, రోడ్డును నిర్బంధించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సామాజిక సాధికార బస్సు యాత్ర కాదని, కబ్జా కోరుల యాత్ర అని విమర్శించారు. మున్సిపల్ ఛైర్మన్ బల్ల గిరిబాబుకు పదవి కట్టబెట్టి మంత్రి మానసికంగా క్షోభ పెడుతున్నారని విమర్శించారు. సమావేశంలో గాలి కృష్ణారావు, టంకాల రవి శంకర్ గుప్తా, దాసరి తాతారావు, తలగాన నరసింహమూర్తి, గోళ్ల చంద్రరావు, కొత్త సత్యం, సప్ప నవీన్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

పలాస : తారు రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే బిల్లులు చెల్లించడం కుదరదని మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ కాంట్రాక్టర్‌కు హెచ్చరించారు. పలాస ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలో నిర్మిస్తున్న తారు రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నిబంధనలకు అనుగుణంగా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటి వరకు పలాస ప్రాంతంలో తారు రోడ్డు పనులు పూర్తి చేశామని చెప్పారు. మరో రెండు రోజుల్లో కాశీబుగ్గ ప్రాంతంలో రోడ్డు పనులు ప్రారంభిస్తామని అన్నారు. ఆయనతో ఎఇ అవినాష్, సిబ్బంది ఉమా ఉన్నారు.



రోడ్డు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వైసిపి హయాంలో దళితులకు అన్యాయం



పలాస : అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న శిరీష

ప్రజాశక్తి- నరసన్నపేట

'నా ఎస్‌సిలు... నా బిసిలు' అంటూనే వైసిపి ప్రభుత్వం వారి గొంతులను కోసేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ దళిత సంఘ నాయకులు రమణమూర్తి అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాలుగున్నరేళ్ల వైసిపి పాలనలో సుమారు ఆరు వేల మంది దళితులపై దాడులు జరిగాయని అన్నారు. దళిత యువకుడు శ్యాంపై దాడి చేసి మూత్రం పోసి తాగించడం నీచం, దుర్మార్గమైన చర్యని అన్నారు. ఎన్నికల్లో మాయ మాటలు చెప్పి దళితుల ఓట్లు వేయించుకొని సిఎం అయిన తరువాత వారిపై దాడులు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్‌సి కమిటీ రాష్ట్ర సెక్రటరీ బి.రాము, పార్లమెంట్ సెక్రటరీ యాగటి లక్ష్మణరావు, నియోజకవర్గ అధ్యక్షులు సారవకోట రామారావు, వెలుగు శ్రీరాములు, శిమ్మ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పలాస: వైసిపీ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి దళితులపై దాడులు పెరిగాయని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పొంగనూరుకు చెందిన దళితుడుపై వైసిపి నాయకులు కాళ్లు, చేతులు కట్టి దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దళితులపై జరిగిన దాడికి నిరసనగా మండలంలోని లోహరిబందలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు భావన దుర్యోధన, దాసరి తాతారావు, లబ్బ రుద్రయ్య, ముడుముంచి నవీన్ కుమార్, బద్రి కోదండరావు పాల్గొన్నారు.

ఆమదాలవలస : వైసిపి హయాంలో దళితులకు తీరని అన్యాయం జరిగిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోనెల అప్పారావు అన్నారు. ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ముందుగా ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చి నాలుగున్నర ఏళ్లు కావస్తుందని, దళితులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఏం సామాజిక న్యాయం పాటించారని బస్సుయాత్ర చేపడుతున్నారో చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దళితుల ఓట్లతో అధికారంలోకి వచ్చి నేడు వారిపై దాడులు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎస్‌సి కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి దళితుల స్థితిగతులను నాశనం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో టిడిపిసెల్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ రాడ విజయ్ కుమార్, టిడిపి ఎస్‌సిసెల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గుర్రాల చిన్నబాబు, మాజీ ఎంపిపి అప్పలనాయుడు, తోట రాము, పొన్నాడ అప్పలసూరి, కింజరాపు వెంకటరమణ పాల్గొన్నారు.



ఆమదాలవలస : సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

టిడిపితో 'భవిష్యత్‌కు గ్యారంటీ'



కోటబొమ్మాళి : పోస్టర్లను అందజేస్తున్న గోవిందరాజులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని గోకర్ణపురం, చిన్నహంస గ్రామాల్లో ఆదివారం బాబు షూరిటీ – భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ పాల్గొన్నారు. ఈ మేరకు ఇంటింటికీ వెళ్లి టిడిపి మేనిఫెస్టోతో కూడిన పోస్టర్లను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచకాలకు హద్దూ అదుపు లేదన్నారు. కార్యక్రమంలో హిరమండలం జెడ్‌పిటిసి పొగిరి బుచ్చిరాజు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్ గౌడ, మహిళా జిల్లా ఉపాధ్యక్షులు బూర్ల లలిత కుమారి, పరమేశ్వరరెడ్డి, వరిసి ఢిల్లీరావు, బమ్మిడి శ్రీనివాసరావు, బమ్మిడి భాస్కరరావు, మాలతి శ్రీధర్, హనుమంతు చంద్రశేఖర్, అగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: రాష్ట్రానికి స్వర్ణయుగం రావాలంటే తెలుగుదేశం పార్టీ, నారా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని బిసి సాధికారిత కాష్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు అన్నారు. కోటబొమ్మాళి మేజరు పంచాయతీ పరిధిలోని చిన్నపొందర వీధి, పట్నాయక్ స్ట్రీట్, ప్రకాష్‌నగర్ కాలనీలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ పోస్టర్లను ఆదివారం అందజేశారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అమలు మేనిఫెస్టును వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పాత్రుని గోపి, బొమ్మాళి ప్రసాద్, బొమ్మాళి తాతారావు, రామారావు, భీమారావు, కమ్మకట్టు అప్పలరాజు రెడ్డి, అంపలాం శ్రీను, మూగి అచ్చుయ్యరెడ్డి, రాజు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : టిడిపి ఆధ్వర్యాన బాబు షూరిటీ, భవిష్యత్‌కు గ్యారంటీ పేరుతో నిర్వహిస్తున్న రచ్చబండ కార్యక్రమం గార మండలం దీపావళి గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు తిరిగి సిఎం కావాలని, అప్పుడే యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఇంటింటా కరపత్రాలను పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చల్ల శ్రీను, మండల ఉపాధ్యక్షులు కొర్ని రమణ, పంచరెడ్డి అప్పారావు, మడ్డు ఆదినారాయణ, చల్ల రమణ, మొయ్యాల అసిరినాయుడు, బగ్గు మాధవ, చల్ల లక్ష్మీనారాయణ, నాగేశ్వరరావు ఈశ్వరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న లక్ష్మీదేవి

పలాస : వైసిపి ప్రభుత్వంలో రాష్ట్రం సర్వ నాశినమైందని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. మండలంలోని బాహడపల్లిలో భవిష్యత్‌కు గ్యారెంటీ బాబు షూరిటీ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు నాయుడు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ... పోస్టర్లను అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, బమ్మిడి కర్రియ్య, దాసరి తాతారావు, రట్టి లింగరాజు, జె.జోగారావు, బాలసరస్వతి, ధర్మారావు, జోగారావు, జానకిరావు, మాధవరావు, వెంకటేష్, మిన్నారావు, నీలకంఠం, గిరి, ఈశ్వరరావు, వల్లభరావు, డి.పండా పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధస్సు



లావేరు : పుస్తక ప్రదర్శనలో చదువుతున్న విద్యార్థులు

ప్రజాశక్తి- లావేరు

పుస్తక పఠనంతో మేధస్సు లభిస్తుందని గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మొదటి ఆదివారం గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన నిర్వహిస్తామని చెప్పారు. అలాగే ప్రతి ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం ఉంటుందని, ప్రతి విద్యార్థి గ్రంథాలయానికి వచ్చి ఈ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థులకు బహుమతులను గ్రంథాలయం తరుపున అందజేశారు కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయాధికారిణి పి.వరలక్ష్మి ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. గ్రంథాలయంలో ఉండే పుస్తకాలను, నవలలు, కథలు, దేశ నాయకుల జీవిత చరిత్రలను, ఆధ్యాత్మిక గ్రంథాలను, ఆయుర్వేద సంబంధించినవి, సైకాలజీ, రిఫరెన్స్, కాంపిటేటివ్ బుక్స్, మాసంలో వచ్చే వార, పక్ష, మాస పత్రికలను పాఠకులు, గృహిణిలకు, విశ్రాంతి ఉద్యోగులకు, వృద్ధులకు, విద్యార్థిని విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా తెలియజేయడానికే ఈ పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, పాఠకులు, విశ్రాంతి ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రణస్థలం రూరల్ : పుస్తక ప్రదర్శనను వివరిస్తున్న వరలక్ష్మి

ఎచ్చెర్ల: ధర్మవరం శాఖా గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పుస్తక ప్రదర్శన, చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, కన్సోలేషన్ బహుమతులు గోరంట షణ్ముఖరావు, కార్తీక్, సాదు షర్మిల, నిర్మల, సూరపు షర్మిలకు గ్రంథాలయం తరుపున అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు సూర్యనారాయణ, పాఠకులు మధు, నవీన్, శేఖర్, మహేష్, జగదీష్, సురేష్, కిరణ్, ప్రకాష్, సూరిబాబు, శిమ్మ సూర్యనారాయణ, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజన సంక్షేమశాఖలో ఉద్యోగోన్నతులు కల్పించాలి



మాట్లాడుతున్న హరి ప్రసన్న

శ్రీకాకుళం అర్బన్ :గిరిజన సంక్షేమశాఖలో స్కూల్ అసిస్టెంట్, పిజి హోమ్‌ల ప్రమోషన్లు వెంటనే చేపట్టాలని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పూజారి హరిప్రసన్న, ప్రధాన కార్యదర్శి పేడాడ కృష్ణారావులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటికే మూడుసార్లు ఉద్యోగుల గ్రీవెన్స్‌లో వినతులు ఇచ్చినప్పటికీ సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడం బాధా కరమన్నారు. అలాగే గిరిజన సంక్షేమశాఖలో భాషా పండితులు, పిఇటి పోస్టులను అప్ గ్రేడేషన్ చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు న్యాయబద్ధంగా రావాల్సిన డిఎ, జడ్‌పిపిఎఫ్, ఎపిజిఎల్ఐ బకాయిలను తక్షణమే చెల్లించాలన్నారు. పాఠశాలల్లో తరగతులు ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా నేటికీ పాఠశాల నిర్వహణ గ్రాంట్ విడుదల చేయకపోవడంతో ప్రధానో పాధ్యాయుల జేబులు ఖాళీ అవుతున్నాయన్నారు. డిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోత ధర్మారావు మాట్లాడుతూ ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గించాలని, ఉపాధ్యాయులకు ప్రతినెల ఒకటో తేదీనే జీతాలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో డిటిఎఫ్ నాయకులు గున్నంనాయుడు, శ్రీనివాసరావు, రాజశేఖర్, రమణమూర్తి, పార్వతీశం, వై.వి. రమణ పాల్గొన్నారు.



సంతబొమ్మాళి : ఆర్థికసాయం అందజేస్తున్న వసంతరెడ్డి

పలువురికి ఆర్థికసాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

పూర్వ స్నేహితుడి కుటుంబానికి తోటి స్నేహితులు రూ. లక్ష ఆర్థిక సాయాన్ని అందించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1993-94 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల్లో తోటి స్నేహితుడు చేట్ల రామకృష్ణ అనారోగ్యం పాలై విశాఖపట్నంలో ఒక ప్రైవేట్ హాస్పిటల్‌లో అక్టోబర్ 14న తుదిశ్వాస విడిచారు. చిన్న వయసులోనే మరణించిన స్నేహితుడు కుటుంబానికి అండగా ఉండాలని స్నేహితులంతా కలిసి పూర్వవిద్యార్థి సంఘం నాయకుడు, జిల్లా సైనికసంఘం అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు చేతుల మీదుగా ఆ కుటుంబానికి రూ.లక్ష ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో పూర్వ స్నేహితులు ముట్నూరు బాలసుబ్రమణ్యం, దుప్పలపూడి శ్రీనివాస్, మాడుగుల శ్రీనివాస్, కాట్రు సుధాకర్, బేద్రి హరి ప్రసాద్, ఊటపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్రలో నిర్మిస్తున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి జెడ్‌పిటిసి పాల వసంతరెడ్డి రూ.పది వేలు ఆర్థికసాయం ఆదిఆరం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి బుసకల లక్ష్మయ్య, ఉప సర్పంచ్ కూన భాస్కరరావు, వైసిపి నాయకులు బుస్కల సీతారాం, డొక్కరి నీలకంఠం, కళింగపట్నం నాగరాజు, ముద్దపు ఆనంద్, రమణ పాల్గొన్నారు.



ఆమదాలవలస: ఆర్థికసహాయం అందిస్తున్న స్నేహితులు

మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

ప్రజాశక్తి- మందస

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం ఒక సామాజిక బాధ్యతగా భావించాలని ఎంపిపి డొక్కరి దానయ్య అన్నారు. మండలంలోని సొండిపుడిలో గ్రీన్ ఆర్మీ వారి ఆధ్వర్యాన బాదం, కదంబ, చెర్రీ ఫ్రూట్ తదితర నీడనిచ్చే మొక్కలను ఆదివారం నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణహితానికి పాటుపడాలని కోరారు. అటవీ సంపదను కాపాడుకుంటూ మైదాన ప్రాంతంలో విరివిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించే బాధ్యత యువత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సవర బాలకృష్ణ, సర్పంచ్ చిచ్చుల నళిని శ్రీనివాస్, గ్రీన్‌ఆర్మీ అధ్యక్షులు బోనెల గోపాల్, మిస్క కృష్ణయ్య, ఎంపిటిసి దడ్డ కిరణ్‌కుమార్ సర్పంచ్ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.



మందస : మొక్కలు నాటుతున్న ఎంపిపి దానయ్య

రణస్థలం: మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి భవిష్యత్ ఆరోగ్య అవసరాల దృష్ట్యా వ్యక్తిగత హరిత వనాలు ఏర్పాటు అవసరమని హరిత సొసైటీ కన్వీనర్ ఆర్.హరిబాబు అన్నారు. ఆదివారం తన పుట్టినరోజు సందర్భంగా వరిసాం అయ్యప్పస్వామి సన్నిధానం ఆవరణలో గురుస్వామి చిల్ల వెంకట రెడ్డి ఆధ్వర్యంలో మొదటి హరిత వనం ఏర్పాటు చేసి, రక్షణ కంచె ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు తమ పుట్టినరోజుకు కనీసం పది మొక్కలు నాటి, సంరక్షిస్తే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించవచ్చని అన్నారు. కార్యక్రంలో హరిత సంస్థ సెక్రెటరీ పి.తవిటినాయుడు, సభ్యులు రంభ దేవుడుబాబు, సంస్థ కార్యదర్శి సాడి రమణ, సభ్యులు కె.మనోజ్ కుమార్, రవి, పిషిని రమణ, డి.రమణ, రాంబాబు, ఎం.విశ్వనాథ్, సతీష్, పవన్ పాల్గొన్నారు.



బిఎల్ఒ కోసం పోలింగ్ బూత్ వద్ద చూస్తున్న బిఎల్ఎ హరికృష్ణ

స్పెషల్ డ్రైవ్‌కు బిఎల్ఒ గైర్హాజరు

ప్రజాశక్తి- పొందూరు

ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులకోసం ఎన్నికల కమిషన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా రెండు రోజులు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం చేపట్టింది. గ్రామాల్లో ప్రతి బూత్‌లో సంబంధిత బిఎల్ఒలు విధిగా హాజరుకావాలని అధికారులు ఆదేశించారు. అయితే మండలం పెనుబర్తి పంచాయతీ అలమాజీపేట 131 బూత్ బిఎల్ఒగా నియమించిన సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ సంగీత లక్ష్మి ఆదివారం స్పెషల్ డ్రైవ్ విధులకు గైర్హాజరయ్యారు. దీంతో మార్పులు చేర్పుల కోసం బూత్‌కు వచ్చిన గ్రామస్తులు వెనుతిరగాల్సి వచ్చింది. అధికారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి హాజరుకాకపోవడంపై సమాచారాన్ని ఎంపిడిఒకుగాని, తహశీల్దార్‌కు గానీ అందించలేదు. బూత్‌కు వెళ్ళి సిబ్బంది కోసం ఎదురుచూసి వెనుదిరిగామని బిఎల్ఎ బాడాన హరికృష్ణ తెలిపారు. బిఎల్ఒకు ఫోన్‌చేయగా తనకు ఆరోగ్యం బాగోలేదని, అందుకే విధులకు హాజరు కాలేదని తెలిపారు.



మాయాబజార్ నాటకాన్ని ప్రదర్శిస్తున్న సురభి కళాకారులు

అరసవల్లిలో సురభి నాటక ప్రదర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు చెందిన సురభి వేణుగోపాలరావు, శ్రీ వినాయక నాట్యమండలి సురభి థియేటర్స్ కళాకారులు మాయా బజార్ నాటకాన్ని ప్రదర్శించారు. ఆలయం ఎదుగా ఉన్న ఇంద్ర పుష్కరణి ఆవరణలో వైజంతి ఉత్సవ వేదికపై ఈ నాటకాన్ని ప్రదర్శించి ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ ఇఒ విహరి సూర్యప్రకాష్, విశాఖపట్నం తిరుమల తిరుపతి దేవస్థానం హిందు ధర్మ పరిషత్ సూపరింటిండెంట్ చంద్రమౌళేశ్వర శర్మ, శ్రీకాకుళం ప్రోగ్రాం అసిస్టెంట్ లలితా మణి, సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు, జూనియర్ అసిస్టెంట్ బిఎస్ చక్రవర్తి హాజరై కళాకారులను అభినందించారు.



అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ భద్రాచలం

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన


కవిటి: పరిశుభ్రమైన ఆరోగ్యానికి పరిసరాల పరిశుభ్రత అత్యంత అవసరమని దూగానపుట్టుగ సర్పంచ్ డి.భద్రాచలం అన్నారు. గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై ఆదివారం అవగాహన కల్పిస్తూ... పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు చేపడుతున్నామని అన్నారు. గ్రామస్తులూ సహకరించి తమతమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చిన్నారి, గ్రామస్తులు పాల్గొన్నారు.



పరామర్శిస్తున్న గోవిందరావు

'ఎంజిఆర్' పరామర్శ

ఎల్ఎన్‌పేట : మండలంలోని టిడిపి మండల మాజీ అధ్యక్షులు వెలమల గోవిందరావు ఇటీవల జరిగిన బస్సు ప్రమాదంలో గాయపడ్డారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు ఆదివారం పరామర్శించారు. పెద్దకొల్లివలసకు చెందిన ముకాళ్ల అప్పలస్వామి, హిరమండలం మండలం ఆవలింగికి జెడ్‌పిటిసి మాజీ సభ్యులు లోలుగు లక్ష్మణరావును హిరమండలంలోని బొత్స శారదను కూడా పరామర్శించారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని తెప్పలవలస గ్రామంలో వైసిపి నాయకులు అప్పయ్య కుమారుడు యాగాటి రామప్పుడు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన కారణంగా ఆ కుటుంబాన్ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆదివారం పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆనంతరం వైఎస్ఆర్ భీమా పథకంలో భాగంగా తక్షణ సహాయం రూ.10 వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అలాగే వల్లభరావుపేట గ్రామంలో వైసిపి నాయకులు గురాన చిరంజీవి చిన్నాన్న గురాన చిన్న సత్యం ఇటీవల మరణించడంతో ఆ కుటుంబ సభ్యులను స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పరామర్శించి సంతాపం తెలిపారు. ఈయన వెంట సర్పంచ్ ప్రతినిధి బొమ్మలాట శ్రీరాములు, వైసిపి నాయకులు దన్నాన హరి, కొయ్య సోములురెడ్డి, చిల్ల గోవింద, తోట ఆదినారాయణ, ముద్దాడ అప్పారావు, ముద్దాడ రమణ, సిమ్మయ్య, పైడిరాజు, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, సత్యనారాయణ, శ్రీనువాసరావు, హరి, మంగ, బాబురావు, బుజ్జి, రాంబాబు, శ్రీరామ్, పిల్ల అప్పలరాజు ఉన్నారు.

మురుగు కాలువ పరిశీలన

నరసన్నపేట : నరసన్నపేట మేజర్ పంచాయతీలో మౌలిక సదుపాయాలు కల్పనలో, సంక్షేమ పథకాలు అందించడంలో ఎటువంటి సమస్యలు ఉన్నా నాకు తెలియచేస్తే వాటిని పరిష్కారానికి కృషి చేస్తానని సర్పంచ్ బి.శంకర్ అన్నారు. శ్రీదేవి నగర్‌లోని డ్రెయినేజీ వ్యవస్థలో ఉన్న లోపాలను ఆదివారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.